క్లుప్తంగా

నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న జేఏసీ నేతలు

తిరుపతి సిటీ : కామన్ పీజీ సెట్‌కు ఉన్నత విద్యామండలి జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు అమరావతిలో ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయా వర్సిటీలకే పీజీసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ముక్తార్ బాషా, కిషోర్, అమర్, వెంకటేష్, సుధాకర్, వెంకట్ గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

గాల్లో దీపంలా పేదలకు వైద్యం



మాట్లాడుతున్న చంద్రశేఖర్ రాయల్

తిరుపతి తుడా : కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు వైద్యం గాల్లో దీపంలా మారిందని రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ ఆరోపించారు. సోమవారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం, మందుల కొరత, వైద్యుల బాధ్యతారాహిత్యం పెరిగిపోయిందని విమర్శించారు. కార్పొరేట్ హాస్పిటళ్లకు కొమ్ము కాస్తూ ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు తీరుమార్చుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

'హంస'కు ప్రత్యేక కార్యాలయం

తిరుపతి తుడా : ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వీలుగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఏపీ హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా సంఘానికి ప్రత్యేక గదిని కేటాయించడం శుభపరిణామని హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజా ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం కార్యాలయాన్ని మంజూరు చేసిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టైలరింగ్‌లో శిక్షణకు దరఖాస్తులు

పాకాల : టైలరింగ్‌లో శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అరుణ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలానికి చెందిన బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్య వైశ్య, క్షత్రియ, సామాజికవర్గాల్లోని 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. నియోజకవర్గంలో మొత్తం 677 మందికి శిక్షణ పొందే అవకాశముందని వెల్లడించారు. నిత్యం 8 గంటల చొప్పున అయితే 45 రోజులు, 6 గంటలకు 60 రోజులు, 4 గంటల చొప్పున అయితే 90 రోజుల శిక్షణ ఉంటుందని వివరించారు.

అవార్డు గ్రహీతకు అభినందన



మాధవిని అభినందిస్తున్న ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : ఉమెన్ ఆఫ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవిని సోమవారం స్విమ్స్ వర్సిటీ వీసీ ఆర్‌వీ కుమార్ అభినందించారు. కర్ణాటకలోని ఆర్‌ఎల్ జలప్ప కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, శ్రీదేవరాజ్ యూఆర్‌ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మాధవికి అవార్డు ప్రదానం చేశారు. ఈ మేరకు ఆమెతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి షేక్ గౌస్‌బాషాను ప్రశంసించారు.

కార్మికుల కోసం ఈఎస్‌ఐ పథకాలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్యామ్‌బాబు

తిరుపతి తుడా : కార్మికుల కోసం ఈఎస్‌ఐ పలు సేవలు, పథకాలు అందిస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్యామ్‌బాబు కోరారు. సోమవారం ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్‌ఐ కార్పొరేషన్ ఆవిర్భావ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని వెల్లడించారు. ఆర్‌ఎంఓ ఏవీఎస్ ప్రసాద్, వైద్యులు శ్రీధర్, రామకృష్ణ, పద్మావతి, సునీత, ఆఫీస్ అధికారి నారాయణప్ప, నర్సింగ్ అధికారి అమ్ములు, విజయకుమారి పాల్గొన్నారు

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న బ్యాంకర్లు

తిరుపతి రూరల్ : బీసీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు సోమవారం తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల కోసం 1,447 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూకు 917మంది హాజరయ్యారు. బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు.

ప్రభుత్వాలు మారినా.. వారు మారరు.. పలు పర్యాయాలు బదిలీలు చేపట్టినా.. వారు మాత్రం బదిలీ కారు.. ఎస్వీయూలోని ఒకే విభాగంలో.. ఒకే సీటులో తిష్టవేసుకుని ఉండిపోయారు. ఏళ్ల తరబడి పాతుకుపోయి హవా నడిపిస్తున్నారు. ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వస్తారు.. కావాలంటే వెంటనే వెళ్లిపోతుంటారు. అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తారు. ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతారు. ఎల్లప్పుడూ అధికార పార్టీ నేతలతో అంటకాగుతుంటారు. వారిని అడ్డుపెట్టుకుని హల్‌చల్ చేస్తుంటారు. క్రమశిక్షణను అస్సలు పాటించరు. ఉన్నతాధికారులను సైతం లక్ష్యం పెట్టరు. అయినప్పటికీ వారిని కదలించేందుకు ఎవరూ సాహసించరు.



ఎస్వీయూ పరిపాలన భవనం

కదలరు.. వదలరు!

- ఎస్వీయూలో త్వరలోనే మూడో విడత బదిలీలు
- ఒకే సీటులో తిష్టవేసిన కొందరు ఉద్యోగులు
- ఏళ్ల తరబడి పాతుకుపోయి ఇష్టారాజ్యంగా విధులు
- అయినప్పటికీ ట్రాన్స్‌ఫర్ చేయని అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీలో అంతర్గత బదిలీలు ఉద్యోగులలో ఆగ్రహావేశాలకు తావిస్తున్నాయి. బదిలీకి అర్హులా..కాదా.. అనే విషయాలను సైతం వర్సిటీ అధికారులు పరిగణలోనికి తీసుకోకుండా ఇష్టానుసారంగా పెద్ద సంఖ్యలో బదిలీలు చేపట్టారు. పలు ప్రాధాన్యత గల విభాగాలు, డీడీఈలో సుమారు 10 నుంచి 20ఏళ్ల పాటు ఒకే సీటులో తిష్టవేసిన ఉద్యోగులను కదలచ్చడానికి మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందులో ఆంతర్యమేమిటో అర్థం కావడంలేదని వర్సిటీలో చర్చ సాగుతోంది. అధికారులనే శాసించే స్థాయిలో తిష్టవేసిన ఉద్యోగులు ఉన్నారని, అందుకే వారిని బదిలీ చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

రెండో విడతపై అసహనం

ఎస్వీయూలో అంతర్గత బదిలీల రెండవ పర్వం పూర్తయ్యింది. వర్సిటీ అధికారులు ఇప్పటి వరకు రెండు విడతలగా సుమారు 250మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పించారు. అయితే నిబంధనలను తుంగలో తొక్కి తమ అనూయాయులు, అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వారిని ప్రాధాన్యతగల విభాగాలలో కూర్చోబెట్టారు. బదిలీల ప్రక్రియలో అనుభవజ్ఞులైన అధికారులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కొందరు ఉద్యోగులను కనీస పరిజ్ఞానం లేని విభాగాలకు బదిలీ చేయడంపై పలువురు మండిపడుతున్నారు. బదిలీల ప్రక్రియలో అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రుల స్థాయి నుంచి ఒత్తిడి రావడం గమనార్హం. మరో ప్రక్క అధికార పార్టీకి చెందిన కొందరు యువనేతలు సైతం బదిలీల ప్రక్రియపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను నిలదీసినట్లు సమాచారం.

త్వరలో మూడో పర్వం

ఎస్వీయూ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో బదిలీలు జరిగిన దాఖలలు లేవు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆగమేఘాల మీద వర్సిటీలో బదిలీల ప్రక్రియకు స్కెచ్ వేశారు. ఇప్పటికే రెండు విడతలు పూర్తికాగా మరో విడత అంతర్గత బదిలీలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మూడో పర్వం బదిలీల ప్రక్రియలో అయినా ఏళ్ల పాటు తిష్టవేసిన ఉద్యోగులను టార్గెట్ చేస్తారా..లేక వారివైపు చూస్తే తమ స్థానాలకే ప్రమాదమని అధికారులు ఊరుకుంటారో వేచి చూడాల్సిందే.

నగరంలో నేడు

- మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 9 గంటలకు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ విగ్రహానికి పుష్పాంజలి, అనంతరం 10.30 గంటలకు అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు.
- ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సీపీఎం నేతలు ఉదయం 9 గంటల నుంచి ప్రజా సమస్యల సేకరణ.
- రాముల వారి దక్షిణమాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో సంగీత కళానిధి అనంత కృష్ణ శర్మ వర్ధంతి సభ
- స్విమ్స్ శ్రీపద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు నిరంతర వైద్య విద్యపై సదస్సు
- జాతీయ సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు భవన్‌లో ఉదయం 11 గంటలకు నూతన విద్యా విధానంపై జాతీయ సదస్సు
- మెగా కార్పొరేట్ టీ–20 క్రికెట్ లీగ్ సెవెన్త్ ఎడిషన్–2025లో భాగంగా ఎస్వీయూ మైదానంలో ఉదయం 10 గంటలకు క్రికెట్ లీగ్ పోటీలు
- జాతీయ సంస్కృత వర్సిటీలో ఉదయం 10 గంటలకు జానపద విజ్ఞాన సదస్సు
- బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 10 గంటలకు అఖిల భారత యువజన సమాఖ్య సమావేశం

ఉత్సాహంగా క్రీడా పోటీలు



చెస్ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



త్రోబాల్ ఆడుతున్న మహిళలు

తిరుపతి కల్చరల్ : టీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు సోమవారం టీటీడీ పరిపాలన భవన ఆవరణలో ఉత్సాహంగా సాగాయి. క్యారమ్స్ సింగిల్స్‌లో చంద్రశేఖర్ విజయం సాధించగా రమేష్‌కుమార్ రన్నర్‌గా నిలిచారు. క్యారమ్స్ డబుల్స్‌లో చంద్రశేఖర్, రాజేంద్రకుమార్ విజేతలుగా, మల్లికాఖార్జున ప్రసాద్, వెంకటేశ్వర్లు రన్నర్‌గా గెలుపొందారు. మహిళా ఉద్యోగుల త్రోబాల్‌లో ఉషారాణి విజయం సాధించగా, రాజేశ్వరి రన్నర్‌గా నిలిచారు. చెస్‌లో జానకి విజేతగా, శోభాకుమారి రన్నరప్ సాధించారు. బాల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో పాండు రంగారెడ్డి, సుధాకర్ విజయం సాధించగా, రామరాజు, చంద్రశేఖర్ రన్నర్‌గా నిలిచారు. బాల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో లలితమ్మ విజయం సాధించగా, భారతి రన్నర్‌తో సరిపెట్టుకున్నారు. బాల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో లలితమ్మ, భారతి విజయం సాధించగా సుమతి, సావిత్రి రన్నర్ స్థానం కైవసం చేసుకున్నారు.

శ్రీధర్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి లీగల్ : న్యాయవాది శ్రీధర్ సేవలు చిరస్మరణీయమని, యువ న్యాయవాదులకు ఆయన మార్గదర్శకులని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ కొనియాడారు. సోమవారం రాత్రి స్థానిక కోర్టు ఆవరణలో కేఎస్ శ్రీధర్ ఫొటో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి గురునాథ్ మాట్లాడుతూ న్యాయవాది వృత్తిలో కష్టపడితేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. శ్రీధర్ న్యాయవాదిగా, విద్యావేత్తగా, ఆధ్యాత్మికవేత్తగా సేవలందించారని తెలిపారు. తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్ గోపాల్, నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్ రావు, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, న్యాయవాదులు జగదీష్, కేఎస్ వాసు, ముక్కు సత్యవంతుడు, హేమ చంద్రారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

తుడా టవర్స్ పనుల పరిశీలన



సూచనలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి తుడా : నగరంలోని ఆర్‌సీ రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి టవర్స్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అన్నమయ్య కూడలి సమీపంలోని 3.60 ఎకరాల్లో రూ.345 కోట్ల వ్యయంతో తుడా టవర్స్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల వేలం ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ తుడా టవర్స్‌లో ప్లాట్ల కోసం పెద్దసంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అలాగే నగరంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు శ్యామ్‌సుందర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు

గ్రీవెన్స్‌కు 50 వినతులు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 50 వినతులు వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 10 మంది తమ సమస్యలు తెలుపగా, 40 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించినట్లు వెల్లడించారు. ఆయా అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

తిరగబడి 'పోరు'బాట



మాట్లాడుతున్న రవిచంద్రారెడ్డి

తిరుపతి మంగళం : ఎన్నికల సమయంలో ఇష్టారాజ్యంగా అబద్ధపు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిన చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు, విద్యార్థులు తిరగబడి పోరుబాటు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. బాబు మోసాలను ఎండగడుతూ ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద యువతపోరు చేపడుతున్నట్లు వెల్లడించారు. జగనన్న ఆదేశాల మేరకు పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువతపోరు నిర్వహించనున్నట్లు వివరించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు మురళీయాదవ్, నేతలు వెంకటేష్‌రాయల్, రెడ్డెప్ప, గఫూర్ పాల్గొన్నారు.

'స్టే హోమ్'లలో తనిఖీలు

తిరుపతి రూరల్ : మండలంలో నిర్వహిస్తున్న పలు స్టే హోమ్‌లపై సోమవారం రాత్రి పోలీసుల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎవరెవరు బస చేస్తున్నారు, ఎక్కడ నుంచి వచ్చారు, ఎక్కడ పనిచేస్తున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. పలు హోమ్‌స్టేల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ చిన్న గోవిందు తెలిపారు.తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు వచ్చినప్పుడు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఎస్‌ఐలు రామ కృష్ణ, షేక్షావలీ పాల్గొన్నారు.

15 నుంచి ఏఐటీయూసీ శిక్షణ



మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం–హామీలు అమలు అనే అంశంపై ఏఐటీయూసీ నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఈనెల 15,16 తేదీల్లో తలకోనలో శిక్షణ తరగతుల నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు శ్రేణులను సన్నద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 19న చలో విజయవాడ చేపడుతున్నట్లు వివరించారు.

23న మాలల సింహగర్జన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు

తిరుపతి కల్చరల్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 23వ తేదీన తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మాలల సింహగర్జన సభ నిర్వహించనున్నట్లు రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షుడు విమల సుదర్శన్ తెలిపారు. సోమవారం ఈ మేరకు సభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దళితుల సంక్షేమాన్ని పాలకులు విస్మరించి తమ రాజకీయ లబ్ధి చిచ్చు పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. వర్గీకరణ నేపథ్యంలో వేసిన ఏకసభ్య కమిషన్ వన్‌సైడ్‌గా సాగుతోందని ఆరోపించారు. అలాగే సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నేతలు మల్లారపు మధు, ప్రభాకర్, దుగ్గాని జయరామ్, మునిరత్నం, ధర్మయ్య, రాజేంద్రప్రసాద్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో అంతర్జాతీయ సదస్సు



సదస్సుకు హాజరైన అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : స్థానిక కరకంబాడిరోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో అనుసంధన్ నేషన్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టైనబుల్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అండ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు కొనసాగనున్న సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తారకేశ్వర్, డీన్ ఈశ్వర్ రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మీదేవి హాజరై ప్రసంగించారు. డాక్టర్ బి.వెంకటేష్ రెడ్డి, డాక్టర్ వైపీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు

సమస్యలపై సమష్టి పోరాటం



ఈయూ అధ్యక్షుడు చంద్రయ్యతో ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : ఉద్యోగుల సమస్యలపై సమష్టిగా పోరాటం సాగించాలని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపించే దిశగా కృషి చేస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు లతారెడ్డి, జోనల్ ప్రెసిడెంట్ పరంధామయ్య, రీజనల్ చైర్మన్ అల్లయ్య, నేతలు పరమేశ్వర్‌రెడ్డి,శివారెడ్డి, షణ్ముగం,శేఖర్ పాల్గొన్నారు.

'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఈ నెల 12వ తేదీన తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం ఈ మేరకు తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ జగనన్న ఆదేశాలను నేతలు, కార్యకర్తలు సమష్టి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న యువత పోరుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీసుకురావాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో కదలిక రావాలంటే పోరాటమే మార్గమని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలన



మాట్లాడుతున్న నాగన్న

చంద్రగిరి : రాష్ట్రంలో దుర్మార్గ పాలన నడుస్తోందని ఆర్‌సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగన్న మండిపడ్డారు. సోమవారం టవర్ క్లాక్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు భూపంపిణీ చేయాలని, పేదలకు ఇంటి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

విశ్రాంత ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ సమీపంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు సోమవారం నిరసనకు దిగారు. సంఘం రీజనల్ సెక్రటరీ సహదేవరాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందినవారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం నేతలు ఎంఆర్ నాయుడు, శ్రీనివాసులు,భాస్కర్‌రెడ్డి, శేషాద్రి, చంద్రయ్య, ఆర్‌డీ రెడ్డి, రఫీ, నభీసహబ్, పీవీ రాజు, కేశవులు,ఎస్.శర్మ, కేఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీకి డిమాండ్




సమస్యల సేకరణలో సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్ : స్కావెంజర్స్ కాలనీలోని పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా రెండవ రోజు సీపీఎం నేతలు సోమవారం స్కావెంజర్స్ కాలనీలో స్థానికుల నుంచి సమస్యలు స్వీకరించారు. సీపీఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కాలనీలో ఏళ్ల తరబడి నివాసముంటున్న కార్మికులకు ఇంటి పట్టాలు పంపిణీ చేసి, రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, జయంతి, చిన్న, రాజు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పేదల స్థలంపై 'పచ్చ'గద్దలు!

చెరువుల, కాలువలు, గుట్టలు, కొండలు, ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు ఇప్పటి వరకు కాజేశారు. కంటికి కనిపించిన ఖాళీ భూములన్నీ కబ్జా చేసేస్తున్నారు. అందులో భాగంగా పేదలకు పంపిణీ చేసిన జగనన్న కాలనీలోని స్థలాలను సైతం ఆక్రమించుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ప్లాట్లకు వేసిన సరిహద్దు రాళ్లను తొలగించేశారు.

- బొప్పరాజుపల్లెలో జగనన్న కాలనీ ఆక్రమణకు యత్నం
- యథేచ్ఛగా సరిహద్దు రాళ్ల తొలగింపు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన లబ్ధిదారులు



జగనన్న కాలనీ స్థలం, సరిహద్దు రాళ్లు తొలగించిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రామచంద్రాపురం మండలం అనుప్పల్లి పంచాయతీ బొప్పరాజుపల్లెలో సర్వే నంబర్ 183/1లో 1.29 ఎకరాలలో జగనన్న కాలనీకి భూమి కేటాయిస్తూ అప్పటి రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ భూమిలోనే అర్హులైన నిరుపేదలకు ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులకు కేటాయించేందుకు వీలుగా ప్లాట్లకు చుట్టూ సరిహద్దు రాళ్లు కూడా నాటించారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాల్లో కొందరు గృహ నిర్మాణాలు పూర్తి చేయగా మరికొందరు పునాదులు వేసుకున్నారు. అయితే ఆ కాలనీలో ప్రజాప్రయోజనార్థం కొంత భూమిని రిజర్వు చేసిపెట్టగా దానిపై అధికార పార్టీకి చెందిన నేతలు కన్నేశారు. ఎలాగైనా ఆ భూమిని కొట్టేసేందుకు జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకున్న వారినిసైతం బెదిరింపులకు గురి చేస్తున్నట్టు సమాచారం. తాజాగా ఐదు రోజుల క్రితం పచ్చపార్టీ నేతలు కాలనీపై విరుచుకు పడి ప్లాట్లకు ఏర్పాటు చేసిన సరిహద్దు రాళ్లను బలవంతంగా తొలగించారు.

కోర్టులో కేసు ఉన్నప్పటికీ..

జగనన్న లే అవుట్‌లో (సర్వే నంబర్ 183/1) కొంత భూమి తమదంటూ చిత్తూరు జిల్లా బంగారుపాళానికి చెందిన జవ్వాది విజయభాస్కర్, జవ్వాది నాగరత్నమ్మ, జవ్వాది కన్నయ్య హైకోర్టులో అప్పట్లోనే కేసు వేశారు.. ఆ కేసు పెండింగ్‌లో వున్నప్పటికీ ఆ భూమి లోకి ప్రవేశించి లే అవుట్‌ను సైతం టీడీపీ నేతలు ధ్వంసం చేయడం గమనార్హం. దీనిపై సర్పంచ్ గోవర్ధన్‌తో పాటు లబ్ధిదారులు ఇటీవల మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన బాధితులు ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అర్జీ అందించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాధితులు వెల్లడిస్తున్నారు.